తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

బుధవారం

23 సెప్టెంబర్ 2026






## చిగురించిన ఆశలు.. రైతుల ముఖాల్లో నవ్వులు

- అనుకూలంగా మారుతున్న వాతావరణం.. వర్షాలతో పంటలకు ఊరట
- పచ్చబడుతున్న పొలాలు.. దిగుబడిపై రైతుల ఆశలు
- పెట్టుబడులు చేతికొచ్చేనా.. వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు

**కోహిర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఎండల తీవ్రతతో నేల నెర్రెలుబారగా.. పంటలు వాడిపోతున్న దశలో కురుస్తున్న వర్షాలు రైతుల్లో కొత్త ఆశలు రేపుతున్నాయి. కొద్దిరోజులుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో పొలాల్లో తేమ పెరుగుతోంది. దీంతో నీరసించిన పంటలు మళ్లీ పచ్చబడుతుండటంతో రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. అయితే ఈ ఊరట ఎంతకాలం నిలుస్తుందోనన్న ఆందోళన కూడా రైతులను వెంటాడుతోంది.

**వర్షాల కోసం ఆకాశం వైపు చూపులు...**

కోహిర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న, కంది, పెసర సోయాబీన్ తదితర పంటలను సాగు చేశారు. పంటలు వేసిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పలుచోట్ల ఎదుగుదల మందగించింది. భూమిలో తేమ తగ్గిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పంటలు వాడిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లి పంట పరిస్థితిని పరిశీలిస్తూ ఆకాశం వైపు ఆశగా చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**వర్షంతో పంటలకు ప్రాణం...**

తాజాగా కురుస్తున్న వర్షాలు వర్షాధార పంటలకు కొంత ప్రాణం పోశాయి. పొలాల్లో తేమ పెరగడంతో పంటల ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎండలతో నీరసించిన మొక్కలు మళ్లీ తేరుకుంటుండటంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలకు తేమ అందడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

**పెట్టుబడుల భారం.. దిగుబడిపైనే ఆశ...**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, కూలీల ఖర్చులు కలిపి రైతులు ఇప్పటికే గణనీయంగా పెట్టుబడులు పెట్టారు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోతే పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదన్న ఆందోళన నెలకొంది. దీంతో ప్రస్తుతం పొలాల్లో పంట పరిస్థితిని రైతులు నిశితంగా గమనిస్తున్నారు. మరోవైపు మార్కెట్‌లో పంటలకు లభించే ధర కూడా తమ ఆదాయంపై ప్రభావం చూపుతుందని రైతులు భావిస్తున్నారు.

**ఒక్క వర్షం.. ఎన్నో ఆశలు**

రైతుకు వర్షం అంటే కేవలం నీరు కాదు.. పెట్టుబడికి భరోసా, పంటకు ప్రాణం, కుటుంబానికి ఆదాయం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతుల్లో కొత్త ఆశలు నింపుతున్నాయి. మరో రెండు, మూడు విడతలుగా సకాలంలో వర్షాలు కురిసి పంటలకు అనుకూల పరిస్థితులు కొనసాగితే దిగుబడి మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

**పొలాల వైపు పెరిగిన రైతుల చూపులు**

ప్రస్తుతం గ్రామాల్లో రైతుల చర్చంతా పంటల పరిస్థితి, వర్షాలపైనే సాగుతోంది. ఉదయం పొలానికి వెళ్లి పంటను పరిశీలించడం.. నేలలో తేమను గమనించడం.. వాతావరణాన్ని అంచనా వేయడం రైతుల దినచర్యగా మారింది. వర్షం పడితే ఆనందం.. మేఘాలు చెదిరితే మళ్లీ ఆందోళన. ఇలా వాతావరణం మార్పుల మధ్య రైతుల ఆశలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

**చివరి వరకు వరుణుడి సహకారం కావాలి**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కొంత ఊరట లభించినప్పటికీ పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు వాతావరణం అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు సకాలంలో కురిసి పంటలకు అవసరమైన తేమ అందాలని కోరుతున్నారు. ప్రకృతి సహకరిస్తే ఈసారి పెట్టిన పెట్టుబడులు చేతికొచ్చి అప్పుల భారం కొంత తగ్గుతుందని ఆశిస్తున్నారు. పచ్చబడుతున్న పొలాలతో పాటు రైతుల జీవితాల్లోనూ పచ్చదనం రావాలంటే.. పంట చేతికొచ్చే వరకు వరుణుడి కరుణ కొనసాగాల్సిందే.

## మహిళలకు ఉచిత 'జపా మైడ్స్' శిక్షణ

- తల్లి, నవజాత శిశు సంరక్షణలో నైపుణ్యాభివృద్ధి.. ఉపాధి అవకాశాలకు అవకాశం



**వనపర్తి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 'జపా మైడ్స్' (తల్లి, నవజాత శిశు సంరక్షకురాలు) కోర్సును ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. నగర ప్రాంతాల్లో పనిచేయడానికి ఆసక్తి, సంసిద్ధత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 20 రోజుల పాటు ఉచితంగా సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

శిశువుల రోజువారీ సంరక్షణ, పరిశుభ్రత, ఆహారం, భద్రత, అవసరాల నిర్వహణతో పాటు తల్లి సంరక్షణ, ఇంటి వద్ద బాధ్యతాయుతంగా పనిచేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తారు. ఆస్పత్రుల్లో క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా ప్రాయోగిక అవగాహన కల్పిస్తారు. శిక్షణకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను సంస్థ అందుబాటులో ఉంచనుంది. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు.

**సంప్రదించాల్సిన చిరునామా:**

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, వనపర్తి,
పని చేసే మహిళల వసతి గృహ భవనం,
ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా, మర్రికుంట, వనపర్తి-509103.
ఫోన్: 9885940945,
8522088978,
7981684174.

## మిషన్ భగీరథ నీరు.. రోడ్లపాలే!

- జీడిపల్లిలో 25 రోజులుగా ప్రధాన పైపులైన్ లీకేజీ
- రెండుసార్లు మరమ్మతులు చేసినా ఆగని నీటి వృథా..
- సర్పంచ్ ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే.. మిషన్ భగీరథ నీరు మాత్రం రోడ్లపైకి పారుతోంది. జీడిపల్లి గ్రామంలో ప్రధాన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి సుమారు 25 రోజులు గడుస్తున్నా లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. సంబంధిత సిబ్బంది రెండుసార్లు మరమ్మతులు చేసినా పైపులైన్ నుంచి నీరు లీకవుతూనే ఉండటంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది.

లీకేజీ నీరు రోడ్డుపై చేరడంతో బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.ఒకవైపు గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు అందుబాటులో ఉన్న నీరు ఇలా వృథాగా పోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగిలిన పైపును పూర్తిగా మార్చకుండా పదేపదే మరమ్మతులు చేయడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

**అతికించినా.. మళ్లీ లీకేజీ**

పగిలిన పైపును మిషన్ భగీరథ సిబ్బంది రెండుసార్లు మరమ్మతు చేసినప్పటికీ లీకేజీ కొనసాగుతోంది. దీంతో మరమ్మతుల నాణ్యత, పర్యవేక్షణపై గ్రామస్తులు ప్రశ్నలు సంధిస్తున్నారు. తాత్కాలిక చర్యలతో కాలయాపన చేయకుండా పాడైన ప్రధాన పైపును పూర్తిగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. పలు గ్రామాలకు ఇదే ప్రధాన ఆధారం మార్గాలా నుంచి కురుమిద్ద మీదుగా జీడిపల్లి, వెంకటాపూర్, తోటపల్లి తదితర ప్రాంతాలకు ఈ ప్రధాన పైపులైన్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రధాన లైన్ లీకేజీ కారణంగా జీడిపల్లితోపాటు ఇతర గ్రామాల నీటి సరఫరాపైనా ప్రభావం పడుతున్నట్లు పేర్కొన్నారు.

**సర్పంచ్ కేశీచ ఆంజనేయులు వివరణ**







జీడిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ పగిలి సుమారు 25 రోజులు అవుతోందని సర్పంచ్ కేశీచ ఆంజనేయులు తెలిపారు. సమస్యను సంబంధిత మిషన్ భగీరథ సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండుసార్లు పైపును మరమ్మతు చేసినప్పటికీ లీకేజీ పూర్తిగా ఆగలేదన్నారు. దీంతో తాగునీరు వృథాగా పోవడంతోపాటు రోడ్లపైకి నీరు చేరి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఈ ప్రధాన పైపులైన్ ద్వారానే జీడిపల్లితోపాటు ఎల్లికట్ట వెంకటాపూర్,తోటపల్లి తదితర ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.ఇక తాత్కాలిక మరమ్మతులతో కాకుండా పగిలిన ప్రధాన పైపును పూర్తిగా మార్చి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరినట్లు సర్పంచ్ తెలిపారు.

# రూ.1.93 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన





**రామచంద్రాపురం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెల్లాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. కొల్లూరు 2బీహెచ్‌కే ఫేజ్–1 నుంచి ఉస్మాన్‌నగర్ వరకు ప్రధాన రహదారి సెంటర్ మీడియన్‌లో రూ.1.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్లాపూర్ డివిజన్‌లో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సెంట్రల్ లైటింగ్‌తో రాత్రివేళ ప్రయాణికులకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు రహదారి సురక్షితంగా, సుందరంగా మారుతుందన్నారు.

## రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

• రాయికోడులో శనగ విత్తనాలు పంపిణీ ప్రారంభం



**రాయికోడు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రైతు సంక్షేమమె ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డిలు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ లోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక రెడ్డి ఆధ్వర్యంలో మండల స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వర్, ఎంపీడీవో ఎంఏ షరీఫ్, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతులకు సబ్సిడీపై పనిముట్లు, తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నని కొనియాడారు. వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక రెడ్డి మాట్లాడుతూ రైకోడ్ మండలానికి రాష్ట్ర ప్రభుత్వం 5120 బస్తాల శనిగలను మంజూరు చేసింది అన్నారు 25 కిలోల బస్తాపై వెయ్యి రూపాయల సబ్సిడీ అందించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు,సంగారెడ్డి, చరణ్ కుమార్, నాగేశ్వరరావు, రామారావు, నవీన్ కుమార్, వరము మాజీ ఉపాధ్యక్షులు తుకారం, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భావోజీ దేవాలయ అభివృద్ధికి రూ.4.45 కోట్ల నిధులు



**కొత్తపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గిరిజనుల ఆరాధ్య దైవం గురులోక మాసంద్ ప్రభు భావోజీ దేవాలయ పునర్నిర్మాణానికి, నాలుగు కోట్ల 45 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం రూ.4.45 కోట్ల నిధులు మంజూరు చేసింది. గర్భగుడి వాల్స్, డోర్స్, షట్టర్స్‌తో పాటు ఇతర నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొడంగల్ కడా అధికారి వెంకటరెడ్డిలకు కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మోదీ ప్రస్థానంపై విద్యార్థులకు పోటీలు



**నంగునూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నరేంద్ర మోదీ ప్రస్థానం–దేశాభివృద్ధిలో ఆయన పాత్ర' అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. యాదమల్లు మాట్లాడుతూ దేశ నాయకుల జీవితాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యత పెరుగుతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు అవగాహన




**రామాయంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్, బ్యాంకు మేనేజర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఐ డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ ఆధ్వర్యంలో హవేలీ ఘన్‌పూర్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, ఎస్‌బీఐ సౌజన్యంతో విద్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పొదుపు ప్రాధాన్యత, బ్యాంకు ఖాతాల నిర్వహణ, రుణ సదుపాయాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.బ్యాంకు మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ లావాదేవీల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్, ఖాతా వివరాలను అపరిచితులకు వెల్లడించరాదని సూచించారు. అవసరానికి అనుగుణంగా రుణాలను వినియోగించుకోవడంతో పాటు పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు, వోఓఏ ద్యాగాల రాజెల్లు, బ్యాంక్ మిత్ర కట్ట వెంకటలక్ష్మి,మహిళా సంఘాల సభ్యులు, బిక్షపతి, శ్రీశైలంరెడ్డి, గ్రామస్తులు విద్య సంస్థ ప్రతినిధులు,బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకిరువైపులా గుంతలు తీశారు... పనులు మరిచారు





**తూప్రాన్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కొండాపూర్ పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే రోడ్డును వెడల్పు చేయడంలో భాగంగా రోడ్డుకిరువైపులా గుంతలు తీసి పనులు చేపట్టకపోవడంతో వాహనాలపై వెళ్లేవారు ప్రమాదానికి గురవుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక ప్రాంతం నుండి కొండాపూర్ వరకు రహదారి వెడల్పు పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు చేయకపోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు రోడ్డుకు ఇరువైపుల గుంతలు తీసి వదిలివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ప్రతి నిత్యం వందల వాహనాలు తిరిగే రోడ్డు వెడల్పు పనులు పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశ్రామిక ప్రాంతంకు రవాణా సౌకర్యం కలుగుతుందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధి కారులు రహదారి పనులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. జిల్లా అధికారులు కొండాపూర్ వెళ్లే రోడ్డు మరమత్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే పుష్కలంగా నీటి వనరులు

• మండల విద్యాధికారి మారుతీ రాథోడ్





**న్యాల్‌కల్, సెప్టెంబర్ 22, (జనంసాక్షి):** "వృక్షో రక్షతి రక్షితః".. వృక్షాల్ని మనం కాపాడితే.. అ.. వృక్షాలు మనల్ని కాపాడతాయని, వాతావరణ సమతుల్యత, నీటి వనరుల పెరుగుదల కేవలం వాతావరణ సమతుల్యతతోనే సాధ్యమవుతుందని, అందుకు ప్రతిఒక్కరు సమస్త జీవకోటికి పుష్కలంగా ఆక్సిజన్ అందించే మొక్కలను నాటి కాపాడుకోవాలని మండల విద్యాధికారి మారుతీ రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం పీఎం శ్రీ పథకం.. "ఏక్ పేడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా.. మంగళవారం మండలంలోని చాల్కి, కాకిజనవాడ, ముర్తుజాపూర్, తదితర గ్రామాల్లో.. సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థునులతో కలిసి పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను తప్పనిసరిగా రక్షించుకోవాలని పాఠశాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు జనార్దన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, కార్యదర్శులు, సీఆర్పీలు, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలి



**చేర్యాల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** చేర్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలో సిసిఐ పత్తి కొనుగోళ్లను బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రాజపేట మండలాల పరిసర గ్రామాల రైతులను అనుమతించే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పాలనాధికారి పి.రాజ్ కుమార్ కి మెమోరాండం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో చేర్యాల వ్యవసాయ మార్కెట్ చుట్టు ఉన్న మండలాల రైతులకు ఉపయోగకరంగా ఉండేదని నేడు సిసిఐ పత్తి కొనుగోలు జిల్లాలోని రైతులకు వర్తించే విధంగా నిబంధనలను మార్చడం వల్ల అతి సమీపంలో ఉన్న బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రాజపేట మండలాల రైతుల వర్తించే పరిస్థితి లేదు, రైతు ఆరుగాలం కష్టపడి పెట్టుబడి వెచ్చించి పంటను పండిస్తే సమీపంలో ఉన్న పత్తి మిల్లులో సిసిఐ కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ నిబంధనలను తొలగించి కొద్ది రోజుల్లో పత్తి మార్కెట్లు ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున ఇక్కడి రైతులు పండించే పత్తి పంటను చేర్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సిసిఐ కేంద్రాలలో కాటన్ మిల్లుల్లో ఆయా మండలాల రైతుల పత్తిని విక్రయించుకునేందుకు అవకాశం కల్పించే రకంగా నిబంధనలను సడలించి రైతులకు రవాణా ఖర్చులు ఇతరత్రా ఇబ్బందుల నుండి విముక్తులను చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తుప్పతి రాజు, పాల్గొన్నారు.

## నస్కల్ టీచర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



నిజాంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): నిజాంపేట మండలం నస్కల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుమలత రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. పాఠశాలలో అందించిన విశిష్ట సేవలు, నిర్వహించిన కార్యక్రమాలకు గాను "జటాధార ఎడ్యుకేషనల్ టెక్నాలజీ" ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రకటించారు. హైదరాబాదులోని హరిహర కళాభవన్ లో జరిగిన కార్యక్రమం లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 55 మంది ఉపాధ్యాయులతో పాటు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సాగరిక ఆమెను అభినందించారు. ప్రతి ఉద్యోగి వృత్తిలో.. నిబద్ధతగా పనిచేస్తే.. వారికి తగిన గౌరవం దక్కుతుందన్నారు.

## రక్తదానం.. ప్రాణదానం





సంగారెడ్డి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): టి.యు.డబ్ల్యు.జె. ఐ.జె.యు జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి జన్మదిన వేడుకలను సంగారెడ్డి ఐబీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా జర్నలిస్టులు, మిత్రులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం యాదగిరిని జర్నలిస్టులు, స్నేహితులు, కుల బాంధవులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జన్మదిన వేడుకల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు, జర్నలిస్టులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేయూత పింఛన్లకు దరఖాస్తుల పరిశీలన



న్యాల్‌కల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ఇందిరమ్మ చేయూత పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతల పరిశీలన మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని 38 గ్రామపంచాయతీల నుంచి మొత్తం 882 దరఖాస్తులు అందాయి. మండల ప్రత్యేకాధికారి యాదగిరి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్, ఉప తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంఈవో మారుతీ రాథోడ్, వ్యవసాయాధికారి అభినాష్‌వర్మ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులతో కూడిన బృందం దరఖాస్తులను పరిశీలిస్తోంది.

మంగళవారం న్యాల్‌కల్, చినిగేపల్లి, ముంగి, హుసేల్లి, హద్నూర్, చాల్కి టేకు, మిర్జాపూర్ (బి), కాకిజనవాడ, హుస్సేన్‌నగర్ తదితర గ్రామాల్లో పరిశీలన చేపట్టారు. ఈ నెల 18న ప్రారంభమైన ప్రక్రియ 25 వరకు కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్ తెలిపారు. వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నాగల్‌గిద్దలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

నాగల్‌గిద్ద, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): నాగల్‌గిద్ద మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శ్రీకారం చుట్టారు. ఇరాక్‌పల్లి గ్రామంలో ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధితో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని ఆయన తెలిపారు. అనంతరం మావినెల్లి గ్రామంలో రూ.10 లక్షల ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న మహిళా సమైక్య భవన నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక స్వావలంబనకు మహిళా సమైక్య భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సక్రూ నాయక్ తండాలో ఎమ్‌జీఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన పీడబ్ల్యూడీ రోడ్డు కల్వర్టు బ్రిడ్జి పనులను



ఎమ్మెల్యే ప్రారంభించారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తండా ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించడమే లక్ష్యమని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, మహిళా సమైక్య భవనాలు వంటి అభివృద్ధి పనులు గ్రామాల ప్రగతికి దోహదపడటంతో పాటు ప్రజల దైనందిన జీవితంలో సౌకర్యాలను పెంచుతాయని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.





ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామపంచాయతీ సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన డీసీసీ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు

నాగల్గిద్ద, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా నియమితులైన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిని మైకోడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని



మరింత బలోపేతం చేసి కార్యకర్తలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవప్ప, గంగయ్యస్వామి, సంగన్న, ఓంకార్, అశోక్‌రావు, గాండ్ల రాజ్‌కుమార్, సేరి శ్రీనివాస్, నాగయ్య, మల్లయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు గాండ్ల సుధాకర్, వీర్‌కుమార్ (ప్రవీణ్) తదితరులు పాల్గొన్నారు.

## అంజమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్





సదాశివపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): నాగ్సానపల్లి గ్రామ సర్పంచ్ రవికుమార్ తల్లి కాశీపురం అంజమ్మ మృతి చెందడంతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గ్రామానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అంజమ్మ మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, యువత అధ్యక్షుడు నరేష్ గౌడ్, నగేష్ యాదవ్, బిఆర్ఎస్వి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దగొల్ల శ్రీహరి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, యువత నాయకుడు గణేష్ పాల్గొన్నారు.


# జూరాల నీటి విడుదలకు ప్రభుత్వం అంగీకారం

- **బీఆర్ఎస్ పోరాటం ఫలించింది**
- **జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్**

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, రైతులు చేపట్టిన ఆందోళనలు ఫలించాయని బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ అన్నారు. జూరాల నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడం రైతుల విజయమని ఆయన పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడం లేదని ఆరోపిస్తూ గత ఎనిమిది రోజులుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారని అశోక్ తెలిపారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు జూరాల ముట్టడికి పిలుపునిచ్చారని చెప్పారు. ఆందోళనల నేపథ్యంలో పలువురు నాయకులను గృహనిర్బంధం చేసినప్పటికీ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకుని నిరసన చేపట్టారని ఆయన తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం నీటి విడుదలకు అంగీకరించిందని, ఇది తమ పోరాట ఫలితమని అశోక్ అన్నారు.

నిరంజన్‌రెడ్డి వ్యూహంతోనే ఉద్యమం ఉధృతం...

రైతుల ఇబ్బందులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి



తీసుకెళ్లారని అశోక్ తెలిపారు. జూరాల ఆయకట్టు రైతులను కలుసుకునే విధంగా పెబ్బేరు మండలంలో కేటీఆర్ పర్యటించారని, అనంతరం రైతులు స్వచ్ఛందంగా జూరాల ముట్టడికి తరలివచ్చారని చెప్పారు. జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యతపై లెక్కలు తేల్చి రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారని అశోక్ తెలిపారు. జూరాలలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు అవసరమైన మేరకు రిజర్వ్ చేసి, మిగిలిన నీటిని ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు వినియోగించాలని ఆయన సూచించినట్లు చెప్పారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉన్నందున కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి నీటిని పొందే అవకాశాలను పరిశీలించాలని నిరంజన్‌రెడ్డి సూచించారని అశోక్ తెలిపారు. జూరాల నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులు సమగ్రంగా లెక్కలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని ఆయన కోరారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, రైతుల పక్షాన నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు నందిమల్ల అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రకటించిన నీటి విడుదలను సమర్థవంతంగా అమలు చేయాలని

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ భద్రత

- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి
- కమలాపూర్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ పారితోష్ పంకజ్



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆదేశించారు. మానూర్ మండల పరిధిలోని కమలాపూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు.
నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్, లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నారాయణఖేడ్, మానూర్, నాగల్‌గిద్ద మండలాల నుంచి భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు...**

9, 11 రోజుల నిమజ్జనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగినంత లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు, ఫైర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నా భార్యకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదు

- మల్లేశ్వరం ఘటనపై కారంగి గోవిందు మాదిగ ఆవేదన
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్





**కొల్లాపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మల్లేశ్వరం గ్రామానికి చెందిన జర్నలిస్టు కారంగి గోవిందు మాదిగ తన భార్య, అంగన్వాడీ టీచర్ రామచంద్రమ్మపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్యకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం సుమారు 8 గంటలకు రామచంద్రమ్మను బంకల దొబ్బలి కురుమయ్య దూషిస్తూ చేయిపట్టుకుని బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని, అనంతరం చేయితో కొట్టడంతో ఆమె కిందపడిపోయిందని ఆరోపించారు. వెంటనే కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనకు కురుమయ్యతో పాటు బంకల చిన్న నరసింహ తదితరులు బాధ్యులని ఆరోపించారు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది.
తన భార్య 15 ఏళ్లుగా అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారని, ఇంతకాలం ఎలాంటి సమస్య ఎదురుకాలేదని గోవిందు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారాల నేపథ్యంలో అధికారులు అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మెమో జారీ చేయడం ఆమెను మనస్తాపానికి గురిచేసిందన్నారు. సెప్టెంబర్ 19న అంగన్వాడీ కేంద్రం నుంచి మరో కేంద్రానికి బియ్యం తరలిస్తుండగా తన కుమారుడు ద్విచక్రవాహనంపై బియ్యం బ్యాగ్ తీసుకెళ్తున్న దృశ్యాలను కొందరు ఫొటోలు తీసి, అక్రమంగా బియ్యం తరలిస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయిలో వాస్తవాలు పరిశీలించాలని కోరారు.
మల్లేశ్వరం ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన వార్తను సోషల్ మీడియాలో ప్రచురించిన నేపథ్యంలోనే తమ కుటుంబాన్ని రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకున్నారని గోవిందు ఆరోపించారు. స్థానిక రాజకీయ విభేదాలు, ఎన్నికల్లో ఓటు వేయలేదనే కారణాలతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత రాజకీయ నాయకుల స్పందన తెలియాల్సి ఉంది.
సోషల్ మీడియా సమాచారాన్ని ఆధారంగా చేసుకుని కొందరు మీడియా ప్రతినిధులు పూర్తి వివరాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురించడం వల్ల తమ కుటుంబానికి మరింత ఇబ్బంది కలిగిందన్నారు. వార్త ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తుల వాదనను కూడా తెలుసుకోవాలని సూచించారు.
రామచంద్రమ్మపై దాడి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని గోవిందు కోరారు. అంగన్వాడీ ఉద్యోగులు, బలహీన వర్గాల మహిళలకు విధుల సమయంలో రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## తేమ ఒత్తిడిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



**మద్దూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మద్దూరు మండలం దోరేపల్లి గ్రామంలో వరి, పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి ఏ. ప్రవీణ్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల వర్షాలు తగ్గడంతో భూమిలో తేమ శాతం పడిపోతున్న నేపథ్యంలో పంటల్లో తేమ ఒత్తిడి లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు.
రైతులు నేలలో తేమను తరచూ పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పంట అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వినియోగించాలని సూచించారు. కలుపు మొక్కలను నియంత్రించాలని, తేమ లేని పరిస్థితుల్లో అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించవద్దని చెప్పారు. వరి, పత్తి పంటల్లో ఆకులు వాడిపోవడం, ముడుచుకోవడం, ఎదుగుదల మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. పంట దశకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే తేమ ఒత్తిడి ప్రభావాన్ని తగ్గించవచ్చని ఏ. ప్రవీణ్ కుమార్ తెలిపారు.


## రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



**తెలకపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బోర్లు, మోటార్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు సరైన సమయంలో విద్యుత్ అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తరచూ అంతరాయాలు, లో-వోల్టేజ్ కారణంగా రాత్రివేళల్లోనూ పొలాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. విద్యుత్ సమస్యలతో సాగునీరు అందక పంటలు దెబ్బతింటే రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని కోరారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే రైతుల పక్షాన ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## సంఘం బలోపేతానికి నా వంతు కృషి

**ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు సామల బాలరాజు**



**ఉర్కొండ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి);**
సేవా కార్యక్రమాలతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు సామల బాలరాజు అన్నారు. ఊర్కొండ మండల కేంద్రంలో ఆర్య వైశ్య మండల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. దాదాపు అన్ని గ్రామాల నుంచి ఆర్య వైశ్యులు పాల్గొని మండల అధ్యక్షుడిగా సామల బాల్ రాజు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా శంకరయ్య (గుడిగానిపల్లి), వైస్ ఉపాధ్యక్షులుగా గుండ నరేందర్ (మాదారం), వీరమల్ల బాలస్వామి(ఇప్పపహాడ్), కోశాధికారిగా జూలూరి రవి(రాచాలపల్లి), ప్రధాన కార్యదర్శిగా జూలూరి రమేష్ (ఊర్కొండ), ప్రత్యేక సలహాదారులుగా చిదిరే శోభన్ (గుడిగానిపల్లి), వీరమల్ల శ్రీను(ఊర్కొండ) మరియు వివిధ గ్రామాల నుంచి కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.
కార్యక్రమంలో నూతన ఊర్కొండ మండల ఆర్య వైశ్యులు సంఘం అధ్యక్షుడు సామల బాల్ రాజు మాట్లాడుతూ సామాజిక స్పృహతో పలు సేవ కార్యక్రమాలతో పాటు సంఘాన్ని బలంగా తయారు చేస్తూ, సమస్యల పట్ల పోరాడదామని పిలుపు ఇచ్చారు.

## పర్యావరణ సమతుల్యానికై "ఏక్ పేడ్ మాకే నామ్"



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పీఎం శ్రీ పథకం.."ఏక్ పేడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా.. దీర్ఘకాలిక పర్యావరణ సమతుల్యానికి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు రకాల మొక్కలు నాటారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్, హద్నూర్ సహకార సంఘం మాజీ చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో 60 మొక్కలు నాటారు. బాదం, వేప, చింత, అల్లనేరేడు, గులాబీ, గుల్మోర్, తదితర మొక్కలను నాటారు. దశాబ్దాలు, శతాబ్దాల తరబడి సమస్త జీవకోటికి అవసరమైన ఆక్సిజన్, కాలుష్య నియంత్రణ, వాతావరణ సమతుల్యత, నీటి వనరుల పెరుగుదల, తదితర ప్రయోజనాలను పొందవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయ బృందం, పలువురు పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డిని సన్మానించిన జర్నలిస్టులు



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డిని మంగళవారం నారాయణఖేడ్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డితో పాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి జర్నలిస్టులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు.
ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యం.ఏ. ఖైసర్, ఆంజనేయులు, డేనియల్, ఇబ్రహీం, శరణప్ప, షయబాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళకు సమాన అవకాశాలు కల్పించాలి



**పెంట్లవెల్లి, సెప్టెంబర్ 22(జనంసాక్షి):** పెంట్లవెల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ తెలంగాణ పార్టీ జెండాను కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడాల శ్రావణి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి గడపకు చేరాలని, మహిళలకు సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం కల్పించాలన్నారు. మహిళలు ఓటర్లుగా మాత్రమే కాకుండా నాయకులు, నిర్ణయాధికారులుగా ఎదగాలని పేర్కొన్నారు. మహిళలు, దళితులు, బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.
కవితక్క నాయకత్వంలో పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతోందని, పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువత పాల్గొన్నారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం



రామాయంపేట,సెప్టెంబర్ 22 (జనంసాక్షి): రామాయంపేట మండలం, వెంకటాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ ఉమ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాడు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఏఎన్ఎం స్వప్న, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, టీస్కోప్ సిబ్బంది, ఆశా వర్కర్ శారద పాల్గొని హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు, పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల పై ఉన్న అపోహలను వీడి, నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## సంగారెడ్డిలో అర్ధరాత్రి వ్యక్తి హత్య

- స్నేహితుల మధ్య గొడవ మృతికు దారితీసింది





సంగారెడ్డి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): జలాల్‌బాగ్ గ్రౌండ్‌లో మద్యం సేవిస్తుండగా ముగ్గురి మధ్య జరిగిన గొడవలో ఫాసిల్ (45) కత్తిపోట్లకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి బిలాల్ (38) తొడకు గాయాలయ్యాయి. పట్టణ సీఐ రామనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాల్సా సబ్ గడ్డ చెందిన ఫాసిల్, బిలాల్, రహీం (35) సోమవారం రాత్రి సితార థియేటర్ ఎదురుగా ఉన్న జలాల్‌బాగ్ గ్రౌండ్‌లో మద్యం సేవిస్తుండగా వివాదం జరిగింది. దీంతో రహీం కత్తితో ఫాసిల్‌పై దాడి చేయడంతో మృతి చెందాడు. అనంతరం బిలాల్‌పై కూడా దాడి చేయడంతో గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు రహీం పరారీలో ఉండగా, పోలీసులు గాలింపు చేపట్టారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రవాసి ప్రజావాణి ప్రతినిధులు



ఉప్పునుంతల, సెప్టెంబర్ 22(జనంసాక్షి): రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరిని సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధ అంశాలపై మంత్రితో చర్చించారు.

## సమన్వయంతోనే మండల అభివృద్ధి



రాయికోడు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య అన్నారు. మంగళవారం రాయికోడు ఐకేపీ కార్యాలయంలో మండల సాధారణ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.218 కోట్లతో అల్లాదుర్గ్-మెటల్‌కుంట రహదారి పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కంకోల్-రాయికోడు చౌరస్తా పనులు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, భవనాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- జిల్లా అదనపు కలెక్టర్ పాండు
- జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి..
- ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ప్రథమ ప్రాధాన్యత..
- ఎడ్యుకేషనల్ హబ్‌గా పటాన్చెరు..
- భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులది
- మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్చెరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని, భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. పటాన్చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి గురుపూజోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు విద్య, విలువలతో భవిష్యత్తును తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే జీఎంఆర్ చేస్తున్న కృషిని అభినందించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. 25 ఏళ్లుగా గురుపూజోత్సవాలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యేను అభినందించారు. పాఠశాలల సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం సమాజానికి జటిల సమస్యగా మారిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య కారణంగా అడ్మిషన్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు.

అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన 'గురువులకు పాదాభివందనం' కార్యక్రమాన్ని అభినందించిన ఎమ్మెల్యే రూ.26 వేల నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చేర్యాల మాదిగ కుల సంఘం పెద్దమనిషి ఎన్నిక



చేర్యాల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): చేర్యాల పట్టణం స్థానిక అంబేద్కర్ కాలనీలోని ఎల్లమ్మ దేవాలయంలో మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సదర్ పెద్దమనిషిగా భూమిగారి చిన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన భూమిగారి చిన్న మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నాకిచ్చిన ఈ బాధ్యతను స్వీకరిస్తూ మాదిగ కుల సంఘం అభివృద్ధికోసం కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, భూమిగారి రత్నం, ముస్త్యాల కిష్టయ్య, భూమిగారి నర్సింలు, ప్రభాకర్, మల్లిగారి యాదయ్య, ఎర్రోళ్ల నర్సయ్య, సర్వగల్ల నర్సయ్య, రాజయ్య, రమేష్, కరుణాకర్, గుడ్ల బాబు, భూమిగారి శ్రీనివాస్, మల్లేష్, భూమయ్య,మల్లయ్య, జూకయ్య, సూరయ్య, మహేందర్, కర్రోల్ల యాదయ్య, బిక్షపతి, నాగరాజు, దామోదర్,రాజేందర్, మధుకర్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు వినాయక లడ్డూ ప్రసాదం



సంగారెడ్డి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): సంగారెడ్డి మెడికల్ కాలేజీ విద్యార్థులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన పూజ అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న విద్యార్థులను చింత ప్రభాకర్ అభినందించారు. వినాయకుడి ఆశీస్సులు విద్యార్థులపై ఎల్లప్పుడూ ఉండాలని, విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముర్తుజాపూర్ రోడ్డుకు యువకుల శ్రమదానం



న్యాల్‌కల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): మండలంలోని ముర్తుజాపూర్ - కాకిజనవాడ పంచాయతీ రాజ్ రోడ్డుకు.. ముర్తుజాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు శ్రమదానం చేపట్టారు. మంగళవారం గ్రామానికి చెందిన వార్డు సభ్యుల సహకారంతో రోడ్డుపై అత్యంత పెను ప్రమాదకరంగా మారిన పలు గుంతల్లో, నీటినిలువ ప్రాంతంలో అవసరం మేరకు మట్టి, మొహరం (మట్టితో కూడిన రాళ్లు)ను వేసి మెరుగు పరిచారు. దశాబ్దాల కాలంగా పలు ప్రభుత్వాలు, పాలకులు, ప్రజా ప్రతినిధులు మారిన రోడ్డుపై కనీసం మట్టి, మొహరంతో నైనా మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల అటువైపుగా అనునిత్యం రాకపోకలు సాగించే రైతులు, విద్యార్థులు, కూలీలు, ప్రయాణికులు అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య ధోరణి పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సామాజిక బాధ్యతగా.. స్వచ్ఛందంగా వార్డు సభ్యులు, పలువురు యువకులు రోడ్డుకు మట్టితో మరమ్మతులు చేపట్టడం పట్ల ముర్తుజాపూర్, కాకిజనవాడ, అమీరాబాద్, తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు యువకుల చొరవ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు టిప్పర్లు పట్టివేత

- డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు




ఉప్పునుంతల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను తెల్లవారుజామున ఉప్పునుంతల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పి. మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు మూడు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలకు సరైన అనుమతులు, పర్మిట్లు లేవని గుర్తించి సంబంధిత డ్రైవర్లు, యజమానులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ కేసుకు సంబంధించి లక్ష్మారం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, గోపాల్‌పేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన రామస్వామి, చంద్రకల్ గ్రామానికి చెందిన బాలరాజు, తాడూరు మండలం చర్లైతిక్యాల గ్రామానికి చెందిన అంకె కృష్ణయ్యగౌడ్, తెలకపల్లి మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన ఇటిక్యాల మల్లేష్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించడం, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడటాన్ని సహించేది లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి. మహేష్ హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**కమలాపూర్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం కమలాపూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ పరిశీలించారు.

నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసిన బారికేడింగ్, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ.. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిమజ్జనానికి వచ్చే ప్రజలు కూడా అధికారులకు సహకరించి కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.





ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, మైతాబ్, కమలాపూర్ సర్పంచ్ రమేష్, తిమ్మాపూర్ సర్పంచ్ గిర్మాజ భరత్ పటేల్, దత్తు రెడ్డి, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంగీత ను కలిసి వినతిపత్రం అందజేశారు.

టీజేఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన నాయకులు జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల జాబితాను రూపొందించి, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని టీజేఏ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సిద్దిక్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ సాబ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముజాహిద్, నాయకులు మహిపాల్ రెడ్డి, అశోక్ బాబు, ఆహేద్ పటేల్, చంద్రారెడ్డి, రామకృష్ణ, కాళీలుద్దీన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### రూ.11.50 లక్షల విలువైన

## విద్యుత్ తీగల చోరీ.. 9 మంది అరెస్ట్



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర విద్యుత్ తీగలను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ మంగళవారం రాత్రి హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్రైమ్ పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో గత మూడేళ్లుగా తరచూ విద్యుత్ తీగల చోరీలకు పాల్పడుతున్న ముఠాకు సంబంధించిన 13 కేసులను గుర్తించినట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.11,50,747 విలువైన విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చోరీ కేసుల్లో 11 మంది నిందితులపై కేసులు నమోదు చేయగా, మంగళవారం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని సరిహద్దు గ్రామాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు, క్రైమ్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో హద్నూర్ ఎస్సై సుజిత్, క్రైమ్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు 96 మంది భూబాధిత రైతులకు ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్ల పంపిణీ

- ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు



**కొండాపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండల పరిధిలోని తొగర్ పల్లి, అలియాబాద్, గ్రామాలకు చెందిన 96 మంది భూబాధిత రైతులకు ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను నేడు పంపిణీ చేయనున్నట్లు సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, తెలిపారు.

418 సర్వే నంబర్లకు సంబంధించిన భూబాధిత రైతులకు ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లను నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అర్హులైన రైతులు సకాలంలో హాజరై తమ పట్టా సర్టిఫికెట్లను స్వీకరించాలని వై. ప్రభు, తెలియజేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



**శివ్వంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పిల్లుట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో అర్హులైన పేద కుటుంబాలకు సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్డుల ద్వారా సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసి పథకాలను పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ కార్డులు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీ మాధవానంద ఆశ్రమాన్ని సందర్శించిన అధికారులు



**కొల్చారం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండ లం రంగంపేట శివారులోని శ్రీ మాధవానంద ఆశ్రమాన్ని తెలంగాణ ప్రభుత్వ ధార్మిక సలహాదారు గోవిందచారి, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు మంగళవారం సందర్శించారు. శ్రీశ్రీశ్రీ మాధవా నంద సరస్వతి స్వామివారిని దర్శించుకుని గోదావరి నది పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామివారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డు నమోదు తప్పనిసరి



**శివ్వంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రైతులకు వ్యవసాయ శాఖ అందించే సేవలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందేందుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో లావణ్య తెలిపారు. ఫార్మర్ ఐడీతో ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువులు పొందడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి విక్రయానికి అవకాశం ఉంటుందన్నారు. మండలంలో పలువురు రైతులు ఇంకా నమోదు చేసుకోలేదని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో గ్రామంలోని ఏఈఓలను సంప్రదిస్తే అక్కడికక్కడే నమోదు చేసి ఐడీ అందజేస్తారని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు









**మిర్జిల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పశువులను మిర్జిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు.

మున్ననూరు టోల్‌గేట్ వద్ద పోలీసులు నిర్వహించిన పెట్రోలింగ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 15 పశువులను రెండు బొలెరో పికప్ వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులు వాహనాల వివరాలు:మొదటి వాహనం (టీఎస్31టీఏ5230): వాహనంలో 7 పశువులను. డ్రైవర్ మహ్మద్ ఆదిల్ (తండ్రి: హుస్సేన్), పశువుల యజమాని మహ్మద్ అఖిల్ (తండ్రి: మహ్మద్ అహ్మద్ హుస్సేన్) గా గుర్తించారు. వీరు వంగూరు గ్రామానికి చెందినవారు.రెండవ వాహనం (ఏపీ22వై0135) వాహనంలో 8 పశువులను.యజమాని వంగూరుకు చెందిన మహ్మద్ అఖిల్ (తండ్రి: మహ్మద్ అహ్మద్ హుస్సేన్) వ్యవహరిస్తున్నట్లు నిర్ధారించారు.మొత్తం 15 పశువులతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని మిర్జిల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

## నిబంధనలు ఉల్లంఘించి డీజే ఏర్పాటు..

- ముగ్గురికి రిమాండ్



**మద్దూరు, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మద్దూరు మండలం పెదిరిపహాడ్‌లో డీజేలకు అనుమతి లేదని ముందుగానే హెచ్చరించినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించిన మాలకడి హనుమంతు అలియాస్ అంజి, జోగు వెంకటప్ప, దర్పల్లి పెంటప్పలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. మరో తొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రజకుల సమస్యలపై శాసనసభలో గళమెత్తాలి




**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రజకుల సమస్యలపై శాసనసభలో రాష్ట్ర ఓబీసీ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గళమెత్తాలని వనపర్తి రజక సంఘం జిల్లా నాయకుడు విజయ్ కోరారు. రజకులకు ఉచిత విద్యుత్, రక్షణ చట్టం, 100 శాతం సబ్సిడీ రుణాలు, సొసైటీ రుణాలు, జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు కల్పించాలని కోరారు. ఆధునిక లాండ్రీ పరికరాలపై శిక్షణ, షాపుల కేటాయింపు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన 102 జీఓ ప్రకారం మున్సిపాలిటీల్లో ఆధునిక లాండ్రీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమై నిలిచిపోయాయని తెలిపారు. వాటిని పునరుద్ధరించి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వయోవృద్ధుల సాధికారత పురస్కారాలకు దరఖాస్తులు

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల సాధికారత రాష్ట్ర పురస్కారాలు-2026కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి డి.సునంద తెలిపారు. సామాజిక సేవ, విద్య, వైద్యం, కళలు, సాహిత్యం, క్రీడలు, వ్యవసాయం, శాస్త్రసాంకేతికం, ప్రజాసేవ తదితర రంగాల్లో సేవలందించిన సీనియర్ సిటిజన్లు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషిచేస్తున్న సంస్థలు, ఎన్జీవోలు, సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలు, వార్తా కథనాలు, నివేదికలు జతచేయాలి. దరఖాస్తు ఫారాలు రూమ్ నంబర్ +-33లో పొందవచ్చు. పూర్తి దరఖాస్తులను ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోపు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని దివ్యాంగుల సంక్షేమ భవన్‌కు పంపాలని సూచించారు.

## గణేష్ మండపంలో 11 కిలోల లడ్డూ చోరీ



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో గణేష్ మండపంలో భక్తులు సమర్పించిన 11 కిలోల లడ్డూ చోరీకి గురైంది. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో సుమారు రూ.3 వేల విలువైన లడ్డూను సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం గుర్తించిన భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నిలిపిన జీలకర్రపంపు సంజీవ్ ఆటోలోని టూల్‌కిట్, సౌండ్ స్పీకర్, టేప్‌రికార్డర్ కూడా చోరీ అయ్యాయి. వాటి విలువ సుమారు రూ.11 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఘటనలపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

## హత్య కేసును ఛేదించిన అమ్రాబాద్ పోలీసులు

**ముగ్గురు నిందితుల అరెస్ట్.. కత్తి, ద్విచక్ర వాహనాలు స్వాధీనం**




**అచ్చంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తి, కమ్ము, పారా కత్తితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.చంద్రయ్య తెలిపారు. అమ్రాబాద్‌కు చెందిన సుమారు 50 ఏళ్ల వ్యక్తి హత్యకు సంబంధించి Cr.No.99/2026 కింద కేసు నమోదైంది. దర్యాప్తులో సీసీ కెమెరాల ఫుటేజీ, కాల్ డేటా రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టి సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లో వారిని అదుపులోకి తీసుకున్నాయి. విచారణ అనంతరం ముగ్గురిని న్యాయపరమైన చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

- **హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**
- **భద్రత, లైటింగ్, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **నిమజ్జన ప్రాంతాల్లో రక్షణ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద సెప్టెంబర్ 23న నిర్వహించనున్న గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రత, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రాత్రివేళ నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు.
రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 23న జరిగే నిమజ్జన కార్యక్రమాలకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. శాంతిభద్రతలు, పోలీస్ బందోబస్తు, నీటి లభ్యత, పారిశుద్ధ్యం, రక్షణ చర్యలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని గణేశ్ ఉత్సవాల్లో ప్రార్థిస్తున్నారని పేర్కొన్నారు.
ఎల్లమ్మ చెరువుకు కాకతీయుల కాలం నాటి చారిత్రక ప్రాధాన్యత ఉందని మంత్రి తెలిపారు. చెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, సుందరీకరణ, గ్లాస్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పల్లె చెరువు నుంచి ఎల్లమ్మ చెరువు వరకు రహదారి అభివృద్ధి, అవసరమైన చోట్ల నాలుగు లైన్ల రహదారులు, ఇతర ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల అభివృద్ధి కూడా కొనసాగుతోందన్నారు.
హుస్నాబాద్ సమగ్ర అభివృద్ధిలో భాగంగా కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్, చిల్డ్రన్స్ పార్క్, ఇండస్ట్రియల్, అర్బన్ పార్కులు, చెరువుల అభివృద్ధి, శాశ్వత తాగునీటి సౌకర్యంపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై 1.19 లక్షల కుట్టు మిషన్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు చెప్పారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఆవు దూడ మృతి



**తెలకపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పిడుగుపాటుకు ఆవు, పెయ్య దూడ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన చాంద్ పాషా తన వ్యవసాయ పొలంలో కట్టేసిన ఆవు, పెయ్య దూడ సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగు పడటంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమకు పశువుల మృతి ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని కలిగించిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పిడుగుపాటు ఘటనపై అధికారులు పరిశీలన చేసి, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది.

## తల్లిదండ్రులు లేని విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**మల్దకల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జన్మదినాన్ని సందర్భంగా మంగళవారం దూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులను కోల్పోయిన 7మంది విద్యార్థులు బి. వీరేంద్ర,అలివేలు మంగమ్మ,గాయత్రి, కె.విఘ్నేశ్వరి, చరణ్,వీరేష్ యు.తేజవర్ధన్ లకు సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి, పాఠశాలకు రాకపోకలకు ఈ సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు లేని విద్యార్థులను గుర్తించి వారికి సైకిళ్లు అందించడం అభినందనీయమని, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి సహాయ కార్యక్రమాలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయని అన్నారు.పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి సైకిళ్లు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సహాయం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి పాఠశాల హాజరుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు,వారి సంరక్షకులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జూరాల రైతుల సంఘర్షణపై బీజేపీ సమరం

**రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనకు ముందే బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు**



**మహమ్మదాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి):** ఎలినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయని, జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనకు బీజేపీ మద్దతు తెలిపింది. ఈనేపథ్యంలో జూరాల ప్రాజెక్టును సందర్శించి.పంటలను పరిశీలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పర్యటనకు పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు జూరాల ప్రాజెక్టు వద్దకు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. అనంతరం ముందస్తు చర్యల్లో భాగంగా, మహమ్మదాబాద్, మండల బిజెపి పార్టీ, అధ్యక్షుడు మూస నరసింహ, జిల్లా నాయకుడు కరువు కృష్ణ,మండల ప్రధాన కార్యదర్శి కాశీనాథ్,మండల ఉపాధ్యక్షులు ఆంజనేయులు, శ్రీనివాసులు, హరి ప్రసాద్‌లను, మహమ్మదాబాద్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు,తరలించారు. ఈసందర్భంగా,వారుమాట్లాడుతూ.. రైతులపంటలను, కాపాడేందుకు సాగునీటి విడుదలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని,బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జూరాల నీటి అంశంపై రైతుల పక్షాన తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- **టాస్క్-సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**
- **నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం..**
- **తుక్కుగూడలో ఉద్యోగ ఎంపికలు**



**కల్వకుర్తి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నిరుద్యోగ యువతకుఅందుబాటులోకి వచ్చేప్రతిఉద్యోగ, ఉపాధి అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సూచించారు.తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో నిర్వహించిన ఉద్యోగ ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి 20 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వెల్దండ నుంచి ఎనిమిది మంది, కల్వకుర్తి నుంచి ఇద్దరు,ఆమనగల్ నుంచి ఆరుగురు,మాడ్గుల నుంచి ఇద్దరు,కడ్తాల్ నుంచి ఇద్దరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకుఆర్థిక భరోసా కల్పించడమేలక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర,మహేష్, శ్రీనివాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు చంద్రశేఖర్, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ





**కల్హేర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డులు లేక అర్హులైన పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా రోడ్డు..

# అధికారులు ఇకనైనా స్పందించరా?

- **రోడ్డు పనులు అర్ధాంతరంగా.. గుంతల్లో ప్రయాణం..**
- **అధికారుల దృష్టి ఎప్పుడు?**
- **గుంతల బాటలో పలు గ్రామాలు..**



**కొల్చారం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కొల్చారం మండల కేంద్రం నుంచి వస్త్రం తండాకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సుమారు కిలోమీటర్ మేర బీటీ రోడ్డు వేసి పనులు నిలిపివేయడంతో, మిగిలిన రహదారి గుంతలమయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

వస్త్రం తండాతో పాటు అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, నాయిని జలాల్‌పూర్, కొంగోడు గ్రామాల ప్రజలు నిత్యం ఇదే రహదారిపై ప్రయాణిస్తుంటారు. రహదారి దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించి, మిగిలిన భాగానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## డీసీసీ పదవి

# దక్కడంతో ఖేడ్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు**



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి నియమితులైన నేపథ్యంలో నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఆయనకు డీసీసీ అధ్యక్ష పదవి దక్కడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

చంద్రశేఖర్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

- **29 పాఠశాలలకు 190 ల్యాప్‌టాప్‌ల పంపిణీ**

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు అందిస్తున్న సహకారాన్ని పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. మంగళవారం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవాభారతి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇనిషియేటివ్ డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 29 ఉన్నత పాఠశాలలకు 190 ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..** విద్యార్థులకు మెరుగైన విద్యా వనరులు అందించడం అందరి బాధ్యత అన్నారు. సేవాభారతి వంటి సంస్థలు సీఎస్ఆర్ నిధుల ద్వారా విద్యారంగానికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. గతంలో ప్రారంభమైన ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమం సమన్వయ లోపంతో నిలిచిపోయిందని, ప్రస్తుతం సంస్థ ప్రతినిధులతో సమన్వయం పూర్తికావడంతో తిరిగి కొనసాగడం సంతోషకరమన్నారు.

పాఠశాలలకు అందించిన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ వనరులను భద్రపరచడానికే పరిమితం చేయకుండా విద్యార్థుల అభ్యసనకు నిరంతరం వినియోగించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధ



భవిష్యత్ విద్యలో కీలకంగా మారనున్నందున విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. కొత్త సాంకేతికతను స్వయంగా వినియోగించేలా చిన్ననాటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు.

నారాయణపేట జిల్లాలో ఇప్పటికే అనేక సీఎస్ఆర్ కార్యక్రమాలు అమలవుతున్నాయని, మరిన్ని సంస్థలను విద్యారంగ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనలో చురుకుగా పనిచేస్తూ పదో తరగతి ఫలితాల్లోనూ మెరుగైన ప్రతిభ కనబరిచేలా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, ఎంఈవో బాలాజీ, సేవాభారతి సభ్యులు రాందేవ్‌రెడ్డి, కిషన్‌జీ, సర్పంచి సంగీత రాములు, హెచ్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన




**మల్దకల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయుర్వేదం, ఆరోగ్యం, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, మండల విద్యాధికారి జి.సురేష్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు యు.రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం, ప్రకృతి సిద్ధమైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యకర జీవనశైలి గురించి వివరించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈవో సురేష్ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, ఫార్మసిస్ట్, ఎస్ఎన్‌వో రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కారంలో రసూల్ పటేల్ సహకారం

# మగ్దూంపల్లిలో ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన



**మునిపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మునిపల్లి మండలం మగ్దూంపల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల పరిష్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ అంజయ్య, జీపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, బీఎల్ఓ, అంగన్‌వాడీ టీచర్ సరళ హాజరై నోటీసులకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలు, ఇతర వివరాలపై కాంగ్రెస్ పార్టీ మునిపల్లి మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ వారికి అవసరమైన సమాచారం అందించారు. ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కార ప్రక్రియలో గ్రామస్తులకు సహకరిస్తూ, అవసరమైన పత్రాల సమర్పణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎల్‌ఏ ఎంపల్లి శ్రీనివాస్, బాయికాడి ఈశ్వరప్ప, వేంపల్లి వీరిశెట్టి, షఫీ ఉద్దీన్, బాయికాడి వీరన్న, ఎంపల్లి ఈశ్వరయ్య, ఫిరోజ్ ఖాన్, చల్మేడ వీరేశం, మహబూబ్ పటేల్, హాజీ పాషా, ఇంతియాజ్, సోఫీ, దర్లపల్లి యేసయ్య తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ క్వారీల ఇసుక పక్కదారి?



**బిజినపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణాలకు కేటాయించిన ఇసుకను క్వారీ నిర్వాహకులు ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలలకు తరలించాల్సిన ఇసుకను గ్రామాల్లో ప్రైవేటు నిర్మాణాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిప్పర్లకు ఓటీపీలు రాకుండా నిలిపివేసి, మూడు వంతుల ఇసుకలో ఒక వంతు మాత్రమే కళాశాలలకు తరలిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అధికార పార్టీ నాయకుల ప్రమేయంతోనే ఇసుక పక్కదారి పడుతోందని, అధికారులు, పోలీసులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత క్వారీ నిర్వాహకులు, అధికార పార్టీ నాయకుల వివరణ తెలియాల్సి ఉంది. ఇసుక అక్రమాలను అరికట్టి ప్రభుత్వ నిర్మాణాలకు కేటాయించిన ఇసుకను సక్రమంగా వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మైనార్టీ సంక్షేమంపై

# కౌన్సిలర్ చైర్మన్‌ను కలిశారు



**చేర్యాల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్‌ను చేర్యాల మున్సిపల్ కౌన్సిలర్ మొహమ్మద్ షరీఫా బేగం ఖాజా మంగళవారం మైనార్టీ సంక్షేమ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట ప్రాంతాలకు చెందిన 56 మంది ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు మంజూరు చేసినందుకు చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా షరీఫా బేగం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గంలోని 56 మంది మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు మంజూరయ్యాయని తెలిపారు. చేర్యాల పట్టణంలోని షాదీఖానా అభివృద్ధికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. త్వరలో కుట్టుమిషన్ల పంపిణీతో పాటు షాదీఖానా అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మైనార్టీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## జూరాల నీటిని పంటలకు విడుదల చేయాలి



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జూరాల ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని వెంటనే పంటల సాగుకు విడుదల చేయాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తిలో ఆయన మాట్లాడుతూ.. నీరు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారని తెలిపారు. తొమ్మిది రోజులుగా జూరాల కాల్వలకు నీటి విడుదల నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 9 టీఎంసీల నీరు ఉన్నందున, 1.8 టీఎంసీలు తాగునీటికి నిల్వ ఉంచి మిగిలిన నీటిని పంటలకు విడుదల చేయాలని కోరారు. తాగునీటి అవసరం ఏర్పడితే కర్ణాటక ప్రాజెక్టుల నుంచి నీటిని తీసుకురావచ్చన్నారు. రైతుల ఆందోళనలను అడ్డుకునేందుకు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. బుధవారం నుంచి నీరు విడుదల చేయకపోతే రైతులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### మరణించిన జర్నలిస్టుల

## కుటుంబాలకు రూ.10 లక్షల సాయం



**జడ్చర్ల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ అకాల మరణం తీరని లోటని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి జి. మధు గౌడ్ అన్నారు. మంగళవారం నసరుల్లాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అత్యవసర వైద్యం కోసం రూ.40 వేలు అందుబాటులో లేక 30 ఏళ్లుగా జర్నలిజంలో పనిచేసిన శ్రీనివాస్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఉచిత హెల్త్ కార్డు ఉంటే ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం, నెలకు రూ.10 వేల జీవితకాల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మహబూబ్‌నగర్‌లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి




**మక్తల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, చైర్మన్, పోలీసు, విద్యుత్, వైద్యశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. శోభాయాత్ర మార్గాల్లో గుంతలు పూడ్చి, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. విద్యుత్ తీగలను సరిచేసి నిరంతర సరఫరా అందించాలని, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళ భక్తుల కోసం అంబులెన్స్, వైద్య శిబిరం, తాగునీరు, నిమజ్జన ఘాట్ వద్ద లైటింగ్, రక్షణ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### దంతేపల్లిలో బాధిత కుటుంబాలను

## పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**రామాయంపేట,సెప్టెంబర్ 22(జనంసాక్షి):** రామాయంపేట మండలంలోని దంతేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెదక్ నియోజకవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నకిర్తి రాజు భార్య చిత్ర ప్రమాదంలో మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లిన తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అదే గ్రామానికి చెందిన గొల్ల సిద్దయ్య తల్లి గొల్ల కమలవ్వ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని కూడా తిరుపతిరెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల మాజీ అధ్యక్షులు నర్సారెడ్డి, మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, నాయకులు మైలారం బిక్షపతి, కొత్త సుధాకర్‌రెడ్డి, సాంగు దంతేపల్లి స్వామి, సిద్ధ రాములు, సాయిలు, మస్కూరు స్వామి, విట్టల్, కొండల్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం రూ.45 లక్షల బస్సు విరాళం

- **ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉదారత**





**గద్వాల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** నిరుపేద విద్యార్థుల కష్టసుఖాలను, వారి రవాణా ఇబ్బందులను గుర్తించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా ఉదారత చాటుకున్నారు. గద్వాల క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం రూ.45 లక్షల విలువైన బస్సును ఆయన సొంత ఖర్చులతో ఉచితంగా విరాళంగా అందజేశారు. దీనితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు 200 సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ బాధలను పంచుకుంటూ సుదూర ప్రాంతాల నుండి క్లినికల్ ట్రైనింగ్ కోసం, ఆసుపత్రులకు వెళ్లడానికి ప్రతిరోజూ ఆటోలు, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్థోమత లేక, సరైన రవాణా వసతి లేక నిత్యం నరకయాతన అనుభవించామని, వర్ష కాలంలో మరియు రాత్రి వేళల్లో తాము పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కష్టాలను ఒక తండ్రిలా, అన్నలా అర్థం చేసుకుని, పిలవగానే స్పందించి ఇంత పెద్ద కానుకను అందించినందుకు విద్యార్థినులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంతోనే ఈ చిన్న సహాయం చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నియోజకవర్గంలోని పేద విద్యార్థుల చదువుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నిరుపేద విద్యార్థుల కష్టాలను గుర్తించి, పెద్ద మనసుతో బస్సు, సైకిళ్లను మంజూరు చేసిన ఎమ్మెల్యే ఉదారతపై నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్టీ సెల్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం




**నారాయణపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కాంగ్రెస్ ఆదివాసీ (ఎస్టీ) సెల్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ వి.లింగం నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన, రాష్ట్ర పరిశీలకుడు శ్రీను నాయక్ పాల్గొన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ కమిటీల నియామకానికి నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**లింగం నాయక్ మాట్లాడుతూ..** అభియాన్ ఉద్దేశం కేవలం కమిటీల ఏర్పాటు కాదని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను గుర్తించి అవకాశాలు కల్పించడమేనన్నారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ఆదివాసీ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, రాజ్యాంగం, ఆదివాసీ హక్కులు, పీసా, అటవీ హక్కుల చట్టాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. పదవుల కంటే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం ముఖ్యమన్నారు. ఆదివాసీ మహిళలు, పేదలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు, హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..** జిల్లాలో ఆదివాసీ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మిస్తామన్నారు. ప్రతి గ్రామంలోని ఆదివాసీల సమస్యలను గుర్తించి మండల, జిల్లా స్థాయికి తీసుకెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా కమిటీలను ఏర్పాటు చేసి, బాధ్యతలు పొందిన నాయకులు ప్రజల మధ్య పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శరణ్‌నాయక్, జిల్లా నాయకులు, సర్పంచ్‌లు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## అరెస్టులు, గృహ నిర్బంధాలతో బిజెపి ఉద్యమాలను ఆపలేరు

- **జూరాల సమస్యలపై బీజేపీ రాష్ట్ర నాయకులు బి.కొండయ్య తీవ్ర ఆగ్రహం**
- **చలో జూరాల కార్యక్రమానికి వెళ్లకుండా నేతల ముందస్తు అరెస్టులు**



**మక్తల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జూరాల ప్రాజెక్టు ఆయకట్టులో అన్నదాతలు ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయానికి, ప్రభుత్వం అకస్మాత్తుగా సాగునీరు నిలిపివేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు తలపెట్టిన చలో జూరాల కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నిరసనలో పాల్గొనేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై బీజేపీ రాష్ట్ర నాయకులు బి. కొండయ్య తీవ్రంగా ఖండించారు.

?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల జూరాల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు తమ కష్టపడి పండించిన పంటను కాపాడుకోలేక మళ్లీ అప్పులపాలు కావాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డాయి. బీజేపీ ఇతర రైతు సంఘాలు గత కొన్ని రోజులుగా జూరాల ప్రాజెక్టు వద్ద శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అధికారులు రైతులకు న్యాయం చేస్తామని మాటవరసకు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటి విడుదలలో తీవ్ర జాప్యం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే జూరాల నుండి పంట పొలాలకు సాగునీరు వదిలి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనం...**

కేవలం ప్రెస్‌మీట్లు పెట్టి గొప్పలు చెప్పుకోవడానికే మంత్రులు, ప్రభుత్వం పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో రైతుల అసలు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని కొండయ్య ఎద్దేవా చేశారు. రైతులకు సాగునీరు అందించలేని ఈ ప్రభుత్వం ఎన్ని ప్రెస్‌మీట్లు పెట్టినా రైతుల కష్టాలు తీరవని స్పష్టం చేశారు.

చలో జూరాల కార్యక్రమానికి బయలుదేరే సమయంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి గృహ నిర్బంధం చేసిన వారిలో కల్లూరి నాగప్ప, మున్సిపల్ కౌన్సిలర్ పీకే నరసింహా, మహేష్ సాగర్, కురువ సత్యం, నరేంద్ర టైలర్, కురువ లింగం, బ్యాటరీ రాజు, గోవిందు, తిరుపతి తదితరులు ఉన్నారు.

# తల్లిపాలే శిశువులకు సంపూర్ణ పోషణకు పునాది

- బాలింతలు, చిన్నారుల పోషణపై విస్తృత అవగాహన కల్పించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పోషణ మాసం సందర్భంగా తల్లులు, బాలింతలు, చిన్నారుల కుటుంబ సభ్యులకు ఉత్తమ ఆహార పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక సూచించారు. 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా నర్వ మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

**కలెక్టర్ మాట్లాడుతూ..** శిశువు పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే మొదటి పాలు కొలస్ట్రం తప్పనిసరిగా అందించాలని, అవి సహజ రోగనిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం వయసుకు తగిన పోషక విలువలతో కూడిన అదనపు ఆహారాన్ని క్రమంగా అందించాలని సూచించారు. ఆరు నెలలకు ముందే ఇతర ఆహారం, ద్రవ పదార్థాలు ఇవ్వడం వంటి పద్ధతులను నివారించాలన్నారు.

బాలింతలు పప్పులు, కూరగాయలు, పండ్లు, ప్రోటీన్‌తో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులను ఎక్కువగా వినియోగిస్తూ ప్యాకెట్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షిత ఆహారం వంటి అంశాలపై అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ అవగాహన



కల్పించాలని తెలిపారు.

చిన్నారులకు అందిస్తున్న ఆహారం, తయారీ విధానం, పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించేలా సూచించాలని అన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని, చిన్న వయస్సులో గర్భధారణ జరిగితే వైద్యుల సూచనల మేరకు పరీక్షలు, స్కానింగ్, ప్రసవ ప్రణాళిక చేపట్టాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అర్హులైన తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో రాజేందర్‌గౌడ్, డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్రమోహన్, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ తప్పనిసరి



**తెలకపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయ అధికారి పి. నర్మద సూచించారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ పొందని రైతులు ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాల వారీగా రూపొందించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి తమ ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీని నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సబ్సిడీ పథకాలు, వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఫర్టిలైజర్ సేల్స్ యాప్ ద్వారా ఎరువులు పొందేందుకు కూడా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ ఎటువంటి ఆలస్యం చేయకుండా నిర్దీత తేదీల్లో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీని తప్పనిసరిగా పొందాలని ఆమె కోరారు.

### జీడిపల్లి గ్రామానికి

## రజితకు సీఎంఆర్ఎఫ్ చెక్కు

**రూ.1.50 లక్షల చెక్కు అందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కల్వకుర్తి మండలంజీడిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల రజిత అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమె వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం రజితకు అందజేశారు. అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజిత కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందేలా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు రజితకు అందడంతో కుటుంబ సభ్యులకు కొంత ఆర్థిక ఊరట లభించింది. ఈ సందర్భంగా రజిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తమకు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షల సాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చికిత్స సమయంలో అందిన ఈ ఆర్థికసాయం ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని అండగా నిలిచిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

## నేడే వనపర్తిలో కిసాన్ మేళా



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** వ్యవసాయ శాఖ, ఆత్మా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 23న ఉదయం 10 గంటలకు వనపర్తిలోని నాగవరం పద్మావతి శ్రీనివాస గార్డెన్స్‌లో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ తెలిపింది. ఎంపీఓ హైమావతి మాట్లాడుతూ రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ డీలర్లు అధిక సంఖ్యలో హాజరై మేళాను విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్యశాఖ, వ్యవసాయ యాంత్రీకరణ తదితర రంగాల్లో ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

హాజరయ్యే రైతులు, డీలర్లు, ప్రజాప్రతినిధులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రజాసేవకు విరామం లేదు.. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండ





**మెదక్ రూరల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో మెదక్ పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పర్యటించారు. గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**కార్యకర్తల కుటుంబాలకు భరోసా...**

ఒక్కరోజే సుమారు 10 నుంచి 12 ప్రాంతాల్లో పర్యటించిన తిరుపతిరెడ్డి.. స్థానికులతో మాట్లాడి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. పలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబం తన కుటుంబమేనని పేర్కొన్నారు.

**బాధితులకు పరామర్శ.. ఆర్థిక సాయం**

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. అవసరమైన వారికి తనవంతు ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చన్నారు.

**మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే: తిరుపతిరెడ్డి**

ప్రజలకు సేవ చేయడానికి పదవి అవసరం లేదని తిరుపతిరెడ్డి అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడమే తన లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, మిషన్ భగీరథ వంటి పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## భార్య ఉండగా రెండో పెళ్లి చేసుకున్న ఘనుడు



**అయిజ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** అయిజ మండలం తూముకుంట గ్రామంలో మొదటి భార్య ఉండగా రెండో భార్యను దొంగ పెళ్లి చేసుకున్న మొగుడి ఇంటి ముందు మొదటి భార్య నిరాహారదీక్ష చేపట్టిన కొంకల అమ్మాయి. వివరాల్లోకి వెళితే కొంకల గ్రామానికి చెందిన అరుణ అలియాస్ పల్లవిని 2021లో తూముకుంట గ్రామానికి చెందిన మద్దిలేటి కుమారుడు భాస్కరు అను వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు.

పెళ్లి అయిన అయిదు సంవత్సరాలు తర్వాత కూడా తనకు సంతానం కలగలేదనే నెపంతో మొదటి భార్య కు తెలియకుండా అరిగిద్దకు చెందిన అమ్మాయిని దొంగతనంగా రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై తనకు న్యాయం జరిపించాలని మొదటి భార్య అయిన అరుణ అలియాస్ పల్లవి తూముకుంట గ్రామంలోని మొగుడి ఇంటి ముందు బంధువులతో కలిసి ధర్నా చేపట్టింది.

## నీటి విడుదలకు చర్యలు రైతుల అధైర్య పడొద్దు

- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్
- నీటి విడుదలకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు



**అయిజ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో డ్యాముల్లోకి నీటి చేరిక అంతంత మాత్రమే ఉంది దీంతో కృష్ణ తుంగభద్ర నది పరివాహ ప్రాంతాల రైతులు పంటలు క్రాప్ హాలిడే ప్రకటించడం జరిగినప్పటికీ కొందరు రైతులు ఆశతో పంటలు సాగు చేసుకోవడం జరిగింది. కానీ డ్యాముల్లోకి నీటి లభ్యత ఆధారంగా తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని అదనంగా ఉన్న నీటిని ఒకటి రెండు తడులకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. తుంగభద్ర జలాల్లో ఈ ఏడాది నీటి కేటాయింపులకు అనుగుణంగా మూడు టీఎంసీలు విడతల వారీగా విడుదల చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే జూరాల ఆయకట్టుకు మరో ఐదు టీఎంసీలు అదనంగా విడుదల చేయించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## కూచురు గ్రామానికి అరుదైన గౌరవం



- అమర జవాన్ యాదగిరికి 'ఆర్మీ బలిదాన్' అవార్డు

నవాబుపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): దేశ రక్షణలో సేవలందించిన కూచురు గ్రామానికి చెందిన జవాన్ బాసిరెడ్డి యాదగిరికి 'ఆర్మీ బలిదాన్' అవార్డు దక్కింది. దేశసేవలో ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందించనున్నారు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో యాదగిరి మృతి చెందారు. ఆయన సేవలను స్మరిస్తూ ఈ నెల 23న నిర్వహించే కార్యక్రమంలో భార్య బాసిరెడ్డి లలిత ఆర్మీ అధికారుల చేతుల మీదుగా అవార్డును స్వీకరించనున్నారు. వందలాది మంది సైనికులను దేశానికి అందించిన కూచురు గ్రామానికి ఈ పురస్కారం ప్రత్యేక గౌరవంగా నిలిచిందని గ్రామస్థులు పేర్కొన్నారు. యాదగిరి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవాబ్‌పేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవాబ్‌పేట మండలం చౌడూరు (మెట్టుగడ్డ తండా) గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆత్మీయులను కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, తానున్నానంటూ మనోధైర్యం కల్పించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ముందస్తు గుర్తింపుతో గుండె వ్యాధులను నియంత్రించవచ్చు

**యశోద ఆసుపత్రి వైద్యులు గురురాజ్ ప్రమోద్**



సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ప్రస్తుత కాలంలో అనేక మంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా గుండె సమస్యలను నియంత్రించవచ్చని సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు గురురాజ్ ప్రమోద్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలు రకాల గుండె జబ్బులకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే ట్యావి (టీఏవీఐ) విధానం ద్వారా చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

అంజియోగ్రామ్, స్టెంటింగ్,యూ వాల్వ్ రీప్లేస్‌మెంట్, బైపాస్ సర్జరీ వంటి చికిత్సల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రాంత ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో ప్రతి మంగళవారం వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గురురాజ్ ప్రమోద్ కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీధర్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేయాలి



హవేళీఘనపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, వివిధ రికార్డులను ఎస్పీ పరిశీలించారు. అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి విచారణను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అప్లికేషన్లలో కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసి అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జన మార్గాలు, ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మంగళవారం మెదక్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న కిచెన్‌ను ఆమె పరిశీలించి యంత్రాలు, సామగ్రి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

మెదక్ జిల్లాలోని 395 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, కిచెన్ ప్లాంట్ మేనేజర్ పునీత్ త్రిపాఠి, అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి



కంగ్టి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): వరంగల్ (మామునూరు) ఎయిర్‌పోర్టుకు తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలని నారాయణఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు లొండే నర్సింలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 1946 జూలై 4న కడవెండి గ్రామంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడుతూ కొమురయ్య ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఆయన త్యాగానికి గుర్తుగా ఎయిర్‌పోర్టుకు పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కడవెండి ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జరిగినందున ఈ నిర్ణయం తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రకు గౌరవమన్నారు. కురుమ సామాజిక వర్గానికి రాజకీయ, విద్యా రంగాల్లో మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయి

- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సిద్దిపేట జిల్లా జట్టు సిద్ధం
- కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలు అందజేసి అభినందించిన మంత్రి



సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): హుస్నాబాద్‌లో గత పది రోజులుగా శిక్షణ పొందుతున్న సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టును రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం అభినందించారు.

ఈ నెల 26వ తేదీ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు హుస్నాబాద్‌లో గత పది రోజులుగా ప్రత్యేక శిక్షణ పొందుతోంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి, వారికి జట్టు జెర్సీలను అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి సిద్దిపేట జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు



తీసుకురావాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు కూడా యువత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను త్వరగా సాధించేందుకు క్రీడా ప్రతిభ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని మంత్రి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.సిద్దిపేట జిల్లా జట్టు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## జీవో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాట్లు?

- కొల్చారం మండలంలో ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు
- అక్రమ సర్దుబాట్లను రద్దు చేసి నిబంధనల ప్రకారం కేటాయింపులు చేయాలని డిమాండ్



మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): మెదక్ జిల్లాలోని కొల్చారం మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 25కు విరుద్ధంగా మండలం దాటి, కోరుకున్న స్థానాలకు కొందరికి కేటాయిస్తూ డిప్యూటేషన్లు వేశారు. మహిళా ఉపాధ్యాయుల విషయంలోనూ ఎలాంటి వెసులుబాటు కల్పించకుండా తండా, మారుమూల ప్రాంతాల పాఠశాలలకు కేటాయించి, మరికొందరిని వారు కోరుకున్న ప్రాంతాల్లో సర్దుబాటు చేశారు .కొల్చారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులను వారు కోరుకున్న పాఠశాలలకు సర్దుబాటు చేసి, ఇతర పాఠశాలలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను కొల్చారం ప్రాథమిక పాఠశాలకు కేటాయించారని ఆరోపిస్తున్నారు.

**విద్యార్థుల సంఖ్యపై అభ్యంతరాలు**

వరిగుంతం, తుమ్మలపల్లి తండా, సంగాయిపేట తండా ప్రాథమిక పాఠశాలల్లో పదిహేను మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్నప్పటికీ ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను కేటాయించారని ఆరోపిస్తున్నారు. అదే సమయంలో కొన్ని పాఠశాలల్లో యాభై ఆరు, యాభై ఏడు మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులతోనే కొనసాగించేలా సర్దుబాటు చేశారని చెబుతున్నారు. కొల్చారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపించడం వల్ల మిగిలిన విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అర్హత లేని డిప్యూటేషన్ చేశారంటూ ఆరోపణ...**

పోతంశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిని అర్హతకు సంబంధించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు యాభై మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కిష్టాపూర్ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని రాంపూర్‌కు పంపించి, కొల్చారం పాఠశాల నుంచి కిష్టాపూర్‌కు డిప్యూటేషన్ చేశారని పేర్కొంటున్నారు. కిష్టాపూర్ పాఠశాలకు అవసరమైన మరో డిప్యూటేషన్ మాత్రం చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

**అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి...**

సర్దుబాటు ప్రక్రియలో జిల్లా విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని కొందరు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను ప్రశ్నించే ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మేరకు ఉపాధ్యాయులను కేటాయించాలని, ఎవరి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను నిబంధనల ప్రకారం వారి పాఠశాలలకు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించాలి

- **మెతుకు సీమ సాంప్రదాయ శోభాయాత్ర.. 6 వేల మందితో ర్యాలీ**





**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు. చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలను విద్యుత్ కాంతులతో అలంకరించి సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అధికారులకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

పర్యాటక దినోత్సవం సందర్భంగా 'మెతుకు సీమ' సాంప్రదాయ శోభాయాత్ర నిర్వహించడంతో పాటు సుమారు 6 వేల మందితో ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. వివిధ కళారూపాల ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి విజయవంతం చేయాలని కోరారు.

యువ టూరిజం క్లబ్‌లలో నమోదైన విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో పర్యాటక, వారసత్వ సంపదపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని డీఈవో, డీఐఈవోలకు సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఈవో రాజు, ఈడీఎం సందీప్, పురావస్తు, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెదక్ ఆర్టీసీ డిపోలో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ ఉద్యోగాలు

- **అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**
- **మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి**



**మెదక్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) మెదక్ డిపోలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు డిపో మేనేజర్ పరమేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. సొంత జిల్లాలోనే ప్రభుత్వ రవాణా సంస్థలో పనిచేసే అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**అర్హతలు, కావాల్సిన పత్రాలు:**

పదో తరగతి ఒరిజినల్ మెమో, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, 18 నెలలు పూర్తి అయిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్

అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని ఒరిజినల్ పత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని ఆఫీస్ టైమింగ్స్‌లో మెదక్ డిపో డీఎం కార్యాలయంలో సంప్రదించాలని డిపో మేనేజర్ సూచించారు.

# విద్యారంగానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి**



**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా 20వ మహాసభలో ఆయన మాట్లాడారు. 1000 రోజుల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ స్కూటీలు, విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధుల కేటాయింపు వంటి హామీల అమలుపై ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని కోరారు. 2026 నుంచి ఏటా రూ.2,400 కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కేటాయించి ముందస్తుగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడాన్ని ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకిస్తోందన్నారు. సంబంధిత జీవోను రద్దు చేసి పాలిటెక్నిక్ కళాశాలలను మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ విధానంతో పరిశ్రమల అనుసంధానం, ఇంటర్న్‌షిప్, స్టైపెండ్ వంటి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోందన్నారు.

మెదక్ జిల్లా కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని మణికంఠరెడ్డి కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో స్థానికంగా ప్రభుత్వ యూనివర్సిటీ లేకపోవడంతో ఉన్నత విద్య కోసం విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు, కార్యదర్శి దినకర్, ఖలీక్, కండె విజేత, మచ్చ రమేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చరగడిలో ముమ్మరంగా చేయూత పింఛన్ల వెరిఫికేషన్

**కోహీర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పిచ్చరగడి గ్రామంలో మంగళ వారం చేయూత పింఛన్ల క్షేత్రస్థాయి వెరిఫికేషన్ కొనసాగింది.

**ఇంటింటికీ వెళ్లి వివరాల పరిశీలన...**

వెరిఫికేషన్ అధికారిగా కోహీర్ మండల విద్యాధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్ వ్యవహరించారు. లబ్ధిదారు ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి వివరాలు, పింఛన్‌కు సంబంధించిన అర్హతలు, కుటుంబ పరిస్థితులను పరిశీలించారు.

**అర్హులకు ప్రయోజనం అందేలా...**

పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు క్షేత్ర స్థాయిలోనే వివరాలను సేకరించడం ప్రాధాన్యత సంతరించు కుంది.

**పకడ్బందీగా వెరిఫికేషన్...**

అర్హత కలిగిన లబ్ధిదారులకు పథకం ప్రయోజనం కొనసాగించేలా నిబంధనలకు అనుగుణంగా వివరాలను నమోదు



చేస్తున్నారు. చేయూత పింఛన్లు నిజమైన అర్హులకు అందేలా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# 70వ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**సిద్దిపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 70వ జిల్లా స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలను డిప్యూటీ కలెక్టర్ భవ్య మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ అవసరమని, క్రీడాకారుల తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. 26 మండలాల నుంచి సుమారు 1,300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్ర భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి జోనల్ పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో డీఈవో రమేష్, డీవైఎస్ఓ వీరారెడ్డి, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లికార్జున స్వామి పల్లకి ఊరేగింపు





**మొగుడంపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని ధనశ్రీ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి పల్లకి మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రతాప్ కులకర్ణి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి హనుమాన్ మందిరం వరకు పల్లకి ఊరేగింపు నిర్వహించారు. శివనామస్మరణతో పరిసరాలు మార్మోగగా, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలు, దండియా, వేదపురోహితుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే కసిరెడ్డి సమీక్ష



**కల్వకుర్తి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గంలో గృహ నిర్మాణ పథకాల అమలుపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో అధికారులు, సహాయ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమావేశమై మంజూరైన ఇళ్లు, నిర్మాణ దశలు, పెండింగ్ సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

అనంతరం వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు, ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ సహాయ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం బీజేపీ ఆందోళన.. పలువురు అరెస్ట్



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలో పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు జూరాల డ్యామ్ సందర్శన నేపథ్యంలో పోలీసులు పలుచోట్ల నాయకులను అడ్డుకున్నారని పేర్కొన్నారు.

వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.నారాయణను ఆత్మకూరు-అమరచింత మార్గమధ్యంలో అదుపులోకి తీసుకుని అమరచింత పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అనుజ్ఞా రెడ్డితో పాటు పలువురిని వనపర్తి టౌన్, కొత్తకోట పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు పేర్కొన్నారు. జూరాల వద్ద బీజేపీ నాయకుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతులను కలిసి సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు శాంతియుత ధర్నా నిర్వహించారు.

ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలని అనుజ్ఞా రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదని కేతూరి బుడ్డన్న పేర్కొన్నారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.